

తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365

TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA

విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9491134365


| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 44 | బుధవారం | 9 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : యంజాల ప్రవీణ్ | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume: 01 | Issue.44 | Wednesday | 9.9.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |




## నా వడోదరా అద్భుతం

- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం

మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్

2లో

## కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే

- సామాన్యులకు ఊరట కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు
- కిలో ఉల్లిపాయలు రాయితీపై రూ.32కే అందించాలని నిర్ణయం
- వచ్చే వారం నుంచి 115 రైతు బజార్లలో విక్రయాలు
- చౌకడిపోల్లో కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి
- బహిరంగ మార్కెట్ కన్నా 30 శాతం తక్కువ ధరకే సరుకులు

2లో

ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో, కిలో ఉల్లిపాయలను కేవలం రూ.32కే రాయితీపై అందించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు





## ‘నా తల్లిని అవమానించారు.. దానికి ఏం చెబుతారు?’

- హరీశ్ రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆగ్రహం
- అసెంబ్లీలో తాతా మధు వ్యాఖ్యలపై తీవ్ర దుమారం
- హరీశ్ రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆగ్రహం
- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరుపై హరీశ్ ఫిర్యాదు
- ఘటనపై విచారణకు ఆదేశించామని స్పీకర్ వెల్లడి
- తన తల్లిపై వ్యాఖ్యలపై హరీశ్‌ను నిలదీసిన స్పీకర్

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల రెండో రోజు కూడా వాడీవేడిగా సాగుతోంది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు సభలో తీవ్ర దుమారం రేపాయి. ఈ అంశంపై చర్చ జరుగుతుండగా బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు

- మిగతా 2వ పేజీలో

### రెండోరోజూ అదే వే'ఢీ'

- ఢీ అంటే ఢీ అన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్
- అసెంబ్లీలో, ఇటు బయట పోటాపోటీ వ్యూహాలు
- రాజకీయ ఆధిపత్యం కోసం రెండు పార్టీల ప్రయత్నాలు
- రాష్ట్ర మంత్రులు, అసెంబ్లీ కార్యదర్శితో పలుమార్లు భేటీ అయిన ముఖ్యమంత్రి
- అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం
- స్పీకర్‌కు సీఎం రేవంత్,డిప్యూటీ సీఎం భట్టి పరామర్శ



### వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు..

## పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి

### ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

- ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సీఎం ఆదేశం
- ఎమ్మార్పీ కంటే ఎక్కువకు మద్యం అమ్మితే కఠిన చర్యలని హెచ్చరిక
- ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచన
- 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన పనులకు ఆమోదం
- టెక్నాలజీ సాయంతో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు పిలుపునిచ్చారు. రెండోరోజు లీడర్‌షిప్ కాన్క్లేవ్‌లో ప్రసంగించిన ఆయన, కొన్ని నియోజకవర్గాలు పౌర సేవల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని, అన్ని నియోజకవర్గాలు ఆ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని, దీనివల్ల ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకుంటున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఎక్కడైనా ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతే కఠినంగా అడ్డుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసి, నకిలీ బ్రాండ్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇప్పుడు మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకొచ్చామని, ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన

- మిగతా 2వ పేజీలో

## సోషల్ మీడియా వినియోగంపై టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం

- ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన
- ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియాలో తిప్పికొట్టాలని పిలుపు
- ప్రధాని మోదీని, తనను ఉదాహరణగా చూపుతూ నేతలకు దిశానిర్దేశం
- అమరావతి అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశం

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. ‘పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్’ అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను “మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?” అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు.



- మిగతా 2వ పేజీలో

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు ఊరట.. రిమాండ్‌కు కోర్టు నిరాకరణ

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌కు ఊరట
- పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించిన నాంపల్లి కోర్టు
- ఎమ్మెల్సీలను వెంటనే విడుదల చేయాలని ఆదేశం
- రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు కోరిన కోర్టు

2లో

## ‘కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది’..

- కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం
- కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ
- ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్
- దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన



## ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే

- ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు పడిపోతాయన్న ట్రంప్
- గ్యాలన్ పెట్రోల్ ధర 2 డాలర్ల కంటే తక్కువకు వస్తుందని జోస్యం
- ట్రూత్ సోషల్ వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించిన అధ్యక్షుడు
- ఇరాన్ ఇంధన వనరులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఇరాన్ హెచ్చరిక
- ప్రస్తుతం అమెరికాలో గ్యాలన్ పెట్రోల్ ధర 4.15 డాలర్లుగా ఉంది

ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు భారీగా పడిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యాసోలిన్ ధర గ్యాలన్‌కు 2 డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు.

- మిగతా 2వ పేజీలో



## తాతా మధు, నవీన్‌రెడ్డి సస్పెన్షన్

- తాతా మధు, నవీన్‌రెడ్డి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతుండగా అడ్డుకుంటున్న అసెంబ్లీ మార్షల్స్
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మండలిలో తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి డి.శ్రీధర్‌బాబు
- సమావేశాలు ముగిసేవరకు సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ ప్రకటన
- అంతకుముందు శాసనసభలోనూ సస్పెన్షన్ తీర్మానం..

హైదరాబాద్: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, నవీన్‌కుమార్ రెడ్డిలను సస్పెండ్ చేయాలన్న సభ్యుల డిమాండ్‌ను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆమోదించారు. వర్షాకాల సమావేశాలు ముగిసేవరకు ఇద్దర్నీ సస్పెండ్

2లో



# నా వడోదరా అద్భుతం

(మొదటి పేజీ తరువాయి)

గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు.. పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో అవకతవకలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచించారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నామని, క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రమైన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గాల్లోని దీర్ఘకాలిక సమస్యలను సుమోటోగా స్వీకరించి పరిష్కరించాలని, తద్వారా ఎమ్మెల్యేలకు ప్రజల్లో మంచి పేరు వస్తుందని అన్నారు. ప్రజల సమస్యల పట్ల మానవత్వంతో స్పందిస్తే సానుకూల దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, 2027 మార్చి నాటికి భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నామని, గత మూడేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని గుర్తుచేశారు. గత సమావేశంలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలను సమీక్షించి, 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన 616 అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

# 'నా తల్లిని అవమానించారు.. దానికి ఏం చెబుతారు?'

(మొదటి పేజీ తరువాయి)

సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ.. మహిళా నేతలపై దాడి జరిగిందన్న ఆరోపణలపై ఇప్పటికే విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదే సమయంలో తాతా మధు తన తల్లిపై చేసిన వ్యాఖ్యల అంశాన్ని స్పీకర్ ప్రస్తావించారు. "నా తల్లిని అవమానించిన అంశంపై ఏం చెబుతారు?" అంటూ హరీశ్ రావును ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే స్పీకర్, హరీశ్ రావు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మరోవైపు మంత్రి సీతక్క కూడా ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని అవమానిస్తే ప్రధాన ప్రతిపక్షం కనీసం విచారం వ్యక్తం చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. మహిళా పోలీసుల ఎదుట బీఆర్ఎస్ నేతలు చొక్కాలు విప్పి విసిరేశారని ఆరోపించారు. అంతేకాకుండా వారిపై దాడికి కూడా పాల్పడ్డారని అన్నారు.

# 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'..

సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.

# తాతా మధు, నవీన్‌రెడ్డి సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

6 గంటలకు శాసనమండలి తిరిగి ప్రారంభమైంది. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇద్దరు సభ్యులు మండలికి వచ్చారని, చట్టసభలో కీలక వ్యక్తిని ఉద్దేశించి వారు తీవ్రమైన వ్యాఖ్యలు చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సభ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై ఎలాంటి చర్చకు అవకాశం ఇవ్వకుండానే మండలి నిబంధనల మేరకు తాతా మధు, నవీన్‌రెడ్డిలను సస్పెండ్ చేస్తున్నట్టు చైర్మన్ ప్రకటించారు. ఈ అంశాన్ని ఎథిక్స్ కమిటీకి నివేదిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ఉదయం ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్‌కు మండలి చైర్మన్‌ను కోరుతూ శాసనసభలో తీర్మానం చేసే వరకు మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. అసెంబ్లీ నుంచి ఆ మేరకు తీర్మానం అందిన తర్వాత మండలి తిరిగి ప్రారంభమైంది. ఆ తర్వాత నిమిషాల వ్యవధిలోనే వారి సస్పెన్షన్ ప్రకటన చేసిన చైర్మన్ సభను బుధవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు. కాగా తాతా మధుసూదన్, నవీన్‌కుమార్ రెడ్డిపై సభా హక్కులు, సభా విధానాలు, క్రమశిక్షణ నిబంధనలకు అనుగుణంగా మండలి చైర్మన్ చర్యలు తీసుకోవాలని కోరుతూ శాసనసభ తీర్మానించింది. సోమవారం శాసన సభాపతిని ఉద్దేశించి వారు అత్యంత అవమానకరంగా, కించపరిచేలా దూషించారంటూ ఆ వ్యాఖ్యలను సభ తీవ్రంగా ఖండించింది.

**కేసీఆర్ క్షమాపణ చెప్పాలి**


'ఇటువంటి ప్రవర్తన శాసనమండలి సభ్యుని హోదాకు ఏమాత్రం తగదు. శాసన సభాపతి గౌరవం, అధికారం రాజ్యాంగబద్ధ హోదాకు ఇది తీవ్ర భంగం కలిగించింది. రాష్ట్ర శాసనసభ గౌరవం, సభా హక్కులు, సంస్థాగత సమగ్రతకు విఘాతం కలిగించే చర్యగా దీనిని సభ పరిగణిస్తోంది. తమ పార్టీ సభ్యుల అనుచిత ప్రవర్తనకు ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్ రావు బాధ్యత వహించి, సభ హుందాతనం, సభా మర్యాదలను పరిరక్షించేందుకు, శాసన సభాపతికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఈ సభ తీర్మానిస్తోంది. ఈ తీర్మానాన్ని శాసనమండలి చైర్మన్‌కు పంపించాలి..'అని శాసనసభ తీర్మానించింది. ఆ సమయంలో బీఆర్ఎస్ సభ్యులెవరూ సభలో లేరు. భూముల నిషేధిత జాబితా (22ఏ) అంశంపై చర్చకు పట్టుబట్టుతూ బీజేపీ సభ్యులూ అప్పటికే వాకౌట్ చేశారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు ఊరట.. రిమాండ్‌కు కోర్టు నిరాకరణ

రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు కోరిన కోర్టు తెలంగాణ శాసనసభ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల కేసులో అరెస్టైన ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని రిమాండ్‌కు తరలించాలన్న పోలీసుల అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో వారిని వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. సభాధ్యక్షుడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో పాటు విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎమ్మెల్సీలపై ఉన్నాయి. అసెంబ్లీ పరిసరాల్లో జరిగిన ఘర్షణలకు సంబంధించి పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో పోలీసులు దాఖలు చేసిన రిమాండ్ అభ్యర్థనపై న్యాయస్థానం ఇరువర్గాల వాదనలు విన్నది. అనంతరం పోలీసుల అభ్యర్థనను తోసిపుచ్చింది. నిందితులు ఇద్దరూ రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలను వెంటనే విడుదల చేయనున్నారు. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనపై పోలీసులు తీసుకున్న చర్యలకు ఇది ఎదురుదెబ్బగా మారింది.

# ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే

(మొదటి పేజీ తరువాయి)




తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇరాన్‌తో యుద్ధంలో మనం గెలిచినప్పుడు, మిగతావన్నీ పడిపోతున్నట్లే చమురు ధరలు కూడా వేగంగా పడిపోతాయి. మొదట గ్యాలన్ ధర మూడు డాలర్లకు, ఆ తర్వాత రెండు డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుంది. ఇదంతా చాలా వేగంగా జరిగిపోతుంది. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఏజీఏ)!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో గ్యాసోలిన్ సగటు ధర గ్యాలన్‌కు సుమారు 4.15 డాలర్లుగా ఉంది. లేబర్ డే సమయంలో ఇది రికార్డు స్థాయి కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 97 డాలర్ల వద్ద, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) 92 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ కూడా ఘాటుగా స్పందించింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ మాట్లాడుతూ.. తమ దేశ ఇంధన వనరులపై దాడి చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి వ్యవస్థలు బహిరంగంగానే ఉన్నాయని, అయితే అమెరికా ఆస్తులు కూడా అదే విధమైన బలహీనతను పంచుకుంటాయని ఆయన గుర్తుచేశారు. గతంలో ఇరాన్ ఆయిల్ ట్యాంకర్ల విషయంలో అమెరికా చేసిన వ్యాఖ్యలను, దానికి తాము ఇచ్చిన సమాధానాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇదిలా ఉంటే.. ఇరాన్‌కు చెందిన నౌకలపై దాడులకు సంబంధించి అమెరికా సెంట్రల్ కమాండ్ (జజుచీజూవీ) అధికారులు చర్చలు జరుపుతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, ఈ వివాదం ఎప్పుడు ముగుస్తుందో, ప్రపంచ ఇంధన మార్కెట్లపై దాని ప్రభావం కచ్చితంగా ఎలా ఉంటుందో అనే దానిపై ట్రంప్ వ్యాఖ్యలు మినహా స్వతంత్రంగా ఎలాంటి ధ్రువీకరణ లేదు.

# సోషల్ మీడియా వినియోగంపై టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం


"సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.



# రెండోరోజూ అదే వే'ఢీ'

హైదరాబాద్: అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల ఢీ అంటే ఢీ రెండోరోజూ కొనసాగింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటిరోజు సోమవారం బీఆర్ఎస్ నేతలు నల్ల టీ షర్టులు ధరించి రావడం, వారు లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం, 'అనుచిత వ్యాఖ్యల వ్యవహారంతో'పరిస్థితి ఉద్రిక్తంగా మారడం తెలిసిందే. కాగా మంగళవారం కూడా అదే వాతావరణంలో ఉభయ సభలు జరిగాయి. ఈ అంశంపై రాజకీయ ఆధిపత్యం సాధించేందుకు రెండు పార్టీలు పోటీలు పడి వ్యూహాలు రచించాయి. ఇక అసెంబ్లీ బయట కూడా ఇదే తీరు కొనసాగించాయి. అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీశ్‌రావుల మధ్య మాటల యుద్ధం సాగగా, కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసం ముట్టడి కార్యక్రమం, కేసీఆర్‌ను ఉద్దేశించి ఆ పార్టీ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు తాజా ఉద్రిక్తతకు, వివాదానికి దారి తీశాయి. మరోవైపు మహిళా పోలీసులపై బీఆర్ఎస్ సభ్యుల దురుసు ప్రవర్తనపై కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేలు తెలంగాణ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఇక అసెంబ్లీ లాబీల్లోనూ ఇదే అంశం నడిచింది. ఉదయం అసెంబ్లీకి రాగానే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి స్పీకర్ చాంబర్‌కు వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ప్రభుత్వం పక్షాన అండగా ఉంటామని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఓదార్చారు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి తన చాంబర్‌లో రాష్ట్ర మంత్రులతో పలు దఫాలు సమావేశమయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిల విషయంలో అసెంబ్లీ వేదికగా ఏం చేయాలన్న దానిపై అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతితో చర్చించారు. ప్రభుత్వం తరఫున ప్రవేశపెట్టే తీర్మానం ఎలా ఉండాలి? భవిష్యత్తులో న్యాయ వివాదాలు రాకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే విషయాలపై మాట్లాడిన సీఎం.. ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని శాసనమండలిని కోరుతూ శాసనసభలో మంత్రి దామోదర రాజనర్సింహతో తీర్మానం ప్రతిపాదింపజేసి, ఆమోదింపజేయాలని నిర్ణయించారు. మరోవైపు బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు కూడా పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమై చర్చించారు. కాంగ్రెస్ ముట్టడి కార్యక్రమాన్ని ధీటుగా ఎదుర్కోవాలని, ఎమ్మెల్సీలు మాత్రం సభలోనే ఉండాలని నిర్ణయించారు.

# కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే



రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం సోషల్ మీడియా ద్వారా వివరాలు వెల్లడించారు. వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయల విక్రయాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ఉల్లితో పాటు, చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.



# కన్నులపండువగా 'మంగళ గౌరీ వ్రతం'

- మార్కండేయ స్వామి ఆలయంలో సామూహిక పూజలు
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ముత్తయిదువులు
- ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** పోచంపల్లి పురపాలక కేంద్రంలోని మార్కండేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని సామూహిక మంగళ గౌరీ వ్రతాలను ముత్తయిదువులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మంగళ గౌరీ అమ్మవారికి సామూహికంగా కుంకుమార్చనలు నిర్వహించి, తమ భర్తల ఆయురారోగ్యాలు, కుటుంబాల్లో సుఖసంతోషాలు, సౌభాగ్యం కలగాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. అనంతరం ముత్తయిదువులు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకుని మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సీతా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భారత ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి అంకం యాదగిరి, సహాయ కార్యదర్శి గుర్రం కృష్ణ, కోశాధికారి ఇంజమూరి యాదగిరి, ధర్మకర్తలు నక్క రామచంద్రం, వనం కృష్ణ, చిక్క వెంకటేష్, ఆటిపాముల నాగేష్, పుట్టబత్తిని శిరీష, గుండు జయలక్ష్మి, దునక పద్మావతి, బడుగు బాలమణి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలోనే 'పోషకాల' తోట!

- దూది వెంకటాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఆకుకూరలు, కూరగాయల సాగు
- ఆరోగ్యకర ఆహార అలవాట్లపై విద్యార్థులకు అవగాహన
- వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యక్ష అనుభవం



**తొలివెలుగు, రాజాపేట:** విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించడంతోపాటు వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు దూది వెంకటాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 'కిచెన్ గార్డెన్'ను అభివృద్ధి చేస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలోనే వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలను సాగు చేస్తూ విద్యార్థులకు ప్రకృతితో మమేకమయ్యే అవకాశం కల్పిస్తున్నారు. బీరకాయ, గోరుచిక్కుడు, వంకాయ, టమాట, పచ్చిమిర్చి, సొరకాయ, దోసకాయలతోపాటు గోంగూర, బచ్చలికూర, మెంతికూర వంటి ఆకుకూరలను తోటలో సాగు చేస్తున్నారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, నీరు అందించడం, పంటల పెరుగుదలను పరిశీలించడం వంటి అంశాల్లో విద్యార్థులు ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. దీంతో వ్యవసాయంపై ప్రాథమిక అవగాహనతోపాటు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని తెలుసుకుంటున్నారు. పాఠశాల తోటలో పండించిన తాజా కూరగాయలు, ఆకుకూరలను వినియోగిస్తూ పోషకాహారం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరిస్తున్నారు. తాజా, సహజసిద్ధమైన ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు సుంచు విజయలక్ష్మి ఆధ్వర్యంలో, కిచెన్ గార్డెన్ కార్యదర్శి, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రాగుల రవీందర్ పర్యవేక్షణలో పాఠశాల సిబ్బంది సహకారంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

# తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

- రెడ్లపై అసభ్య వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణ
- రాజాపేట పిఎస్‌లో తెలంగాణ రెడ్డి సంఘం నేతల వినతి

**తొలివెలుగు, రాజాపేట:** రెడ్లను ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేసిన చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రెడ్డి సంఘం నేతలు మంగళవారం రాజాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సెప్టెంబరు 5న నకిరేకల్‌లో జరిగిన సీఎం సభ సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను ఉటంకిస్తూ క్యూన్యూస్ వేదికగా మల్లన్న రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడారని ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో వర్గాల మధ్య వైషమ్యాలను పెంచి శాంతిభద్రతల సమస్యలకు దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో రెడ్డి సంఘం నేతలు మేక సోమిరెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు
- పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణుల నిరసన
- కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్




**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే కె. శంకర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పోచంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పార్టీ సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే శంకర్‌పై బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుదీర్ఘకాలం పోరాటం చేసి, రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధిని లక్ష్యంగా పనిచేశారని అన్నారు. అలాంటి నాయకుడి మరణాన్ని కోరుకునే విధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు రాజకీయ విమర్శలను హుందాగా చేయాలని, వ్యక్తిగతంగా కించపరిచే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని అన్నారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలపై సమగ్రంగా విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అధికార బలంతో పోలీసులను ఉపయోగించి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన ఆరోపణలు చేశారు. ఇలాంటి చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని, లేదంటే రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాలు సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత దూషణలు, హింసను ప్రేరేపించే వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రజల్లో ఉద్రిక్తతలు ఏర్పడకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ కాందాడి భూపాల్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు సామ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కార్యదర్శి చిలువేరు బాల నరసింహ, నాయకులు చింతకింది కిరణ్, పర్వతం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి
- రైతులు, నిరుద్యోగులు, మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ డిమాండ్



**తొలివెలుగు, చిన్నగూడూరు :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నగూడూరు మండల కేంద్రంలోని దాశరథి సెంటర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఇతర హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆయన విమర్శించారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.12,500, వరి పంటకు రూ.500 బోనస్, పంటల సాగుకు సంబంధించిన హామీలు, రైతు కూలీలకు ఉపాధి హామీ కింద సంవత్సరానికి రూ.12 వేల చొప్పున బకాయిలు చెల్లించాలని కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఆర్థిక సహాయం, మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులు, బీడీ కార్మికులు, దివ్యాంగులకు పెంచిన పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఆడబిడ్డల వివాహానికి తులం బంగారం వంటి హామీలను అమలు చేయాలని కోరారు. విద్యార్థులకు స్కూటీలు, ఇతర సంక్షేమ పథకాలను కూడా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డీఎస్ రెడ్యానాయక్ డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు. కార్యక్రమంలో చిన్నగూడూరు మండల, డోర్నకల్ నియోజకవర్గ యువజన నాయకుడు డీఎస్ రవిచంద్ర నాయక్, టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామ్‌సింగ్ నాయక్, ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, ఉగ్గంపల్లి సర్పంచ్ అయూబ్, మంగపతిరావు, వల్లూరి చెన్నారెడ్డి, యూత్ అధ్యక్షుడు దుండి మురళి, మంగ్యానాయక్, బానోతు యాకూబ్, చెక్కల శ్రీను, బట్టు ఉపేందర్, బ్రహ్మాచారి, జుజ్జూరి శ్రీను, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ యువజన సంఘం అధ్యక్షుడిగా చేపూరి శ్రీనాథ్

- నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక
- గాంధీనగర్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశం



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని గాంధీనగర్‌లో మంగళవారం భగత్ సింగ్ యువజన సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడిగా గడ్డమీది నాగరాజు, గౌరవ సలహాదారులుగా చెక్క సాయిప్రకాష్, భువనగిరి కార్తికేయన్, వంగూరి మణిదీప్, అధ్యక్షుడిగా చేపూరి శ్రీనాథ్, ఉపాధ్యక్షుడిగా వంగూరి విజయ్, ప్రధాన కార్యదర్శిగా మెరుగు కుమార్, కోశాధికారిగా చెక్క భానుప్రకాష్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా వనం మణిశంకర్, వంగూరి శివప్రసాద్, ఆడెపు సిద్ధు, సాంస్కృతిక కార్యదర్శులుగా వంగూరి శ్రీధర్, శ్యామల ప్రవీణ్, శనిగారం చరణ్ ఎంపికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా లంగారు జశ్వంత్, చేపూరి భానుప్రకాష్, వంగూరి సిద్ధు ఎన్నికయ్యారు. సభ్యులుగా వంగూరి శివ, మెరుగు సునీల్, వంగూరి భాను, వంగూరి శ్రవణ్, లంగారు వంశీ, శెట్టి మణిశంకర్, అదిమూలం సాయికిరణ్, గంగదారి అజయ్, బుగ్గ శివ, వనం పవన్ ఎన్నికయ్యారు.

# వినాయక చవితికి నిరంతర విద్యుత్ అందించాలి

- కాలనీల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డీఈకి వినతి
- తక్షణ చర్యలకు ఏఈడీని ఆదేశించిన డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి



**తొలివెలుగు, గడ్డిఅన్నారం:** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆస్మాన్‌ఘాట్ పరిధి డీఈ విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలకు సంబంధించిన సమస్యలను డీఈ దృష్టికి తీసుకెళ్లారు. వినాయక మండపాల వద్ద భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా విద్యుత్ లైన్లను తనిఖీ చేసి, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని కోరారు. వినతిపై స్పందించిన డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి తక్షణమే పరిష్కరించేలా ఏఈడీ అనిల్‌కు ఆదేశాలు జారీ చేశారు.



# చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి

- ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల సాధనకు ఐక్య పోరాటం
- ఈ నెల 10న ఎల్‌బీ స్టేడియంలో హక్కుల సాధన సభ
- ప్రచార పోస్టర్ ఆవిష్కరించిన టీజీ జేఏసీ నేతలు

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల హక్కుల సాధన కోసం ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న 'ఉద్యోగ హక్కుల సాధన సభ'ను జయప్రదం చేయాలని టీజీ జేఏసీ జిల్లా కన్వీనర్ భగత్ పిలుపునిచ్చారు. మంగళవారం పోచంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నాయకులతో కలిసి 'చలో హైదరాబాద్' ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా ఉద్యోగుల సమస్యలపై తగిన శ్రద్ధ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు, వారి కుటుంబాలకు వైద్య భద్రత కల్పించేందుకు ఉద్దేశించిన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) సమర్థవంతంగా అమలు కావడం లేదని అన్నారు. పథకం కింద ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న సభకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భగత్ కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ నాయకుడు యాపాల సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో విజయ, ఎంఈఓ ప్రభాకర్, నాయకులు యాదయ్య, రమేష్, రాములు, లింగయ్య, శ్రీకాంత్‌రెడ్డి, శశికాంత్‌గౌడ్, ఖదీర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# రావిర్యాలలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ...!

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ డివిజన్ రావిర్యాలలో డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు పారదర్శక పాలన దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది.సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ రావిర్యాలలో ఘనంగా జరిగింది. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోధ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కొత్త డిజిటల్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని,అర్హులైన ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. డిజిటల్ విధానం ద్వారా లబ్ధిదారుల వివరాలు సులభంగా అందుబాటులోకి రావడంతో పాటు, పథకాల అమలులో మరింత పారదర్శకత పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన్నాయిగూడ లక్ష్మీనరసింహ ఆలయ చైర్మన్ కోటగళ్ల రంజిత్ కుమార్, గోనమోని బాలరాజ్, కోటగళ్ల రాజ్ కుమార్, లింగం శ్రీనివాస్, సౌకుంట్ల యాదయ్య, చింతల సదానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలను బర్తరఫ్ చేయాలి

- దళిత స్పీకర్‌కు అవమానం సరికాదు
- బీఆర్ఎస్ నేతల తీరుపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పాక మల్లేష్ యాదవ్ ఆగ్రహం
- మాజీ సీఎం కేసీఆర్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లను పదవుల నుంచి శాశ్వతంగా బర్తరఫ్ చేయాలని జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పాక మల్లేష్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పోచంపల్లిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. దొరల పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుండటాన్ని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అహంభావంతో మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన అసెంబ్లీ స్పీకర్ పదవిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, స్పీకర్‌పై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటికీ అసెంబ్లీకి హాజరుకాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన మాజీ సీఎం కేసీఆర్.. ప్రభుత్వం నుంచి లభించే సుమారు రూ.22 కోట్ల విలువైన జీతాలు, రాయితీలను అనుభవించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేయలేని పరిస్థితిలో ఉంటే కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని పాక మల్లేష్ యాదవ్ డిమాండ్ చేశారు.

# గణేష్ మండప నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

- ముందస్తు అనుమతులు తప్పనిసరి
- వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి



**తొలివెలుగు, వలిగొండ :** వినాయక చవితి ఉత్సవాలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి కోరారు. గణేష్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు పోలీస్, విద్యుత్, గ్రామ పంచాయతీ అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగేలా మండపాలు ఏర్పాటు చేయవద్దని తెలిపారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం నిర్ణీత సమయం దాటిన తర్వాత మైకులు, డీజేలు వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రతి మండపం వద్ద నిర్వాహకులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి వేళల్లో కనీసం ఇద్దరు నిర్వాహకులు అందుబాటులో ఉండి భద్రతను పర్యవేక్షించాలని సూచించారు. శోభాయాత్ర సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# 'ఛలో అసెంబ్లీ'ని జయప్రదం చేయాలి

- గ్రామపంచాయతీల బకాయి బిల్లులు వెంటనే విడుదల చేయాలి
- రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్‌గౌడ్



**తొలివెలుగు, రాజాపేట :** రాష్ట్ర సర్పంచుల కమిటీ పిలుపు మేరకు బుధవారం హైదరాబాద్ అసెంబ్లీ ఎదుట నిర్వహించే భారీ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాజాపేట మండలం రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సర్పంచులు పెద్దఎత్తున తరలివచ్చి 'ఛలో అసెంబ్లీ'ని విజయవంతం చేయాలని కోరారు. సర్పంచుల హక్కుల సాధన, గ్రామాల అభివృద్ధి, బకాయిల విడుదల కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామపంచాయతీలకు రావాల్సిన ఎస్ఎఫ్‌సీ నిధులను తక్షణమే విడుదల చేయాలని, పెండింగ్ అభివృద్ధి పనుల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీలకు తగిన ఆర్థిక వనరులు కల్పించి స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మద్యం తాగించి.. యాసిడ్ పోసి దారుణం

- మిత్రుడిపైనే పాశవిక దాడికి ఒడిగట్టిన ముఠా
- ఉస్మానియా ఆస్పత్రి ఐసీయూలో జేసీబీ డ్రైవర్
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. స్నేహితులతో కలిసి మద్యం తాగిన అనంతరం ఓ యువకుడిపై దాడి చేసి, రసాయనిక ద్రవం (యాసిడ్) పోసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనలో బాధితుడికి తీవ్ర కాలిన గాయాలు కాగా, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ వలిగొండ రోడ్డుకు చెందిన షేక్ గౌస్ (19) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం (సెప్టెంబరు 7) మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో అతని స్నేహితుడు బుడ్డా వినయ్ గౌస్‌ను బయటకు తీసుకెళ్లాడు. అనంతరం మార్కండేయనగర్‌లోని గంగోత్రి వాటర్ ప్లాంట్ సమీపంలో స్నేహితులంతా కలిసి మద్యం సేవించినట్లు పోలీసులు తెలిపారు. మద్యం సేవించిన అనంతరం గౌస్‌పై స్నేహితులు దాడి చేసి, రసాయనిక ద్రవం పోసినట్లు సమాచారం. ఈ ఘటనలో గౌస్ ఎడమ చెంప, తల, చెవి భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఎడమ ఛాతీ, భుజం, రెండు చేతులు, తొడ భాగాల్లో కాలిన గాయాలయ్యాయి. దాడి అనంతరం తీవ్ర భయాందోళనకు గురైన గౌస్ తన అన్న షేక్ హైమద్‌కు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలిపాడు. ఆ సమయంలో పోచంపల్లిలో ఉన్న హైమద్.. వెంటనే తన తండ్రి, స్నేహితులను సంఘటనా స్థలానికి పంపించాడు. అయితే అప్పటికే భయపడిన గౌస్ అక్కడి నుంచి పరుగులు తీసి కేసీఆర్ కాలనీలోని భారత్ పెట్రోల్ బంకు సమీపంలోని ఓ ఇంట్లో దాక్కున్నాడు. అనంతరం కుటుంబ సభ్యులు గౌస్‌ను గుర్తించి చికిత్స కోసం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం గౌస్ ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుడి సోదరుడు షేక్ హైమద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మథకుమార్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తులో వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

# బసంతాపురం ఆదర్శ గ్రామం కావాలి

- సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్
- డ్రైనేజీ, అంగన్‌వాడీ భవనానికి నిధుల హామీ.. కొత్త రేషన్ దుకాణానికి ఆదేశం

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల పరిధిలోని బసంతాపురం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ సూచించారు. కలెక్టర్ గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి పైలట్ ప్రాజెక్టులో భాగంగా కొనసాగుతున్న సర్వే ప్రక్రియను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారులు, విద్యార్థులతో ముచ్చటించి అక్కడి వసతులపై ఆరా తీశారు. చిన్నారులకు అందుతున్న సేవలను పరిశీలించి, కేంద్రంలో సేవలందిస్తున్న సిబ్బందిని అభినందించారు.

**డ్రైనేజీ, అంగన్‌వాడీ భవనానికి నిధులు:**

గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంతో పాటు అంగన్‌వాడీ భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**బసంతాపురంలోనే రేషన్ దుకాణం:**

ప్రస్తుతం రేషన్ సరుకుల కోసం పక్క గ్రామమైన కాల్వపల్లికి వెళ్లాల్సి వస్తోందని సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ బసంతాపురం గ్రామంలోనే కొత్తగా రేషన్ దుకాణం మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్వే ప్రక్రియకు గ్రామ రైతులు అందిస్తున్న సహకారం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. చిన్న గ్రామమైన బసంతాపురాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేసేందుకు సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. గ్రామ అభివృద్ధి కోసం ముందుకు వస్తున్న యువకులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.





కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుల్లపల్లి రాజు గౌడ్, వార్డు సభ్యులు మెండు ఉపేందర్‌రెడ్డి, వడ్లకొండ మాధవి, గంధమల్ల కవిత, వడ్లకొండ రాములమ్మ, ములకలపల్లి రమేష్, గ్రామ ప్రముఖులు మెండు మధుసూదన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, చిన్నా నరసింహారెడ్డి, సాయికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తుర్కపల్లిలో కాంగ్రెస్ భారీ రాస్తారోకో





- బీఆర్ఎస్ నేతల తీరును నిరసిస్తూ ఆందోళన
- వెయ్యి కార్లతో ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు
- ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సభ్యత్వాలను రద్దు చేయాలి: బీర్ల అయిలయ్య

**తొలివెలుగు, తుర్కపల్లి :** తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరును, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరై మద్దతు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో రాస్తారోకోలో పాల్గొని డప్పులు వాయిస్తూ, నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ నాయకుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో తుర్కపల్లి మండల కేంద్రంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చిట్యాల–ఢిల్లీ హైవేపై, కీసర–యాదగిరిగుట్ట హైవేపై వాహనాలు నిలిచిపోయాయి.

**'బహిరంగ క్షమాపణ చెప్పాలి':**

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తెలంగాణ ప్రజలకు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా దళిత వర్గానికి చెందిన స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ ముఖ్య నాయకులు దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు.

**'ఎమ్మెల్సీల సభ్యత్వాలు రద్దు చేయాలి':**

బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిల శాసనమండలి సభ్యత్వాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభ, శాసనమండలి వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు, అవమానకర చర్యలకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్తామని, ఎంతటి వారినైనా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

**'దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుతాం':**

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను కలుపుకొని ప్రజాపాలన అందిస్తోందని బీర్ల అయిలయ్య అన్నారు. దళితుల గౌరవాన్ని పెంచే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ వద్ద 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. దళిత బిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరైనా వ్యవహరిస్తే సహించబోమని అన్నారు. దళితుల ఆత్మగౌరవం కోసం రోడ్లపై బైఠాయించి రాస్తారోకో నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరసనలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో డప్పులు వాయిస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని చెప్పారు.

**ఫామ్‌హౌస్ ముట్టడికి యత్నం:**

అనంతరం "కేసీఆర్ రాజకీయ చావు డప్పు" కార్యక్రమంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు వెయ్యి కార్లలో కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుల తీరును కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. దళితుల గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరించే వారిని ప్రజలు ప్రశ్నించాలని బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు.





# సూర్యారావుపాలెం డిపాజిట్ల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలి





**-డిపాజిట్‌దారులకు వెంటనే సొమ్ము చెల్లించాలని డిమాండ్**

**-నిరసన దీక్షకు సీపీఎం మద్దతు**

**ఉండ్రాజవరం, సువర్ణ జ్యోతి, సెప్టెంబర్ 8 :** సూర్యారావుపాలెం గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగినట్లు ఆరోపణలు ఉన్న రూ.4.40 కోట్ల డిపాజిట్ల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామంలో సుమారు 180 మంది రైతులు, పేదలు సహకార సంఘంలో డిపాజిట్లుగా దాచుకున్న సొమ్ము తిరిగి చెల్లించకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డిపాజిట్‌దారులకు వారి సొమ్మును వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సూర్యారావుపాలెం గ్రామానికి చెందిన చిట్టూరి నరసింహమూర్తి స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.19 లక్షలు డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ అధికారులు తమ సొమ్మును తిరిగి చెల్లించకపోవడంతో విసిగిపోయిన నరసింహమూర్తి మంచంతో సహా సహకార సంఘం వద్దకు వచ్చి పడుకుంటూ నిరసన దీక్ష చేపట్టినట్లు పేర్కొన్నారు. నరసింహమూర్తి చేపట్టిన నిరసన శిబిరాన్ని సీపీఎం నాయకులు సందర్శించి పార్టీ తరఫున మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జువ్వల రాంబాబు మాట్లాడుతూ 2019 నుంచి సహకార సంఘంలో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అవకతవకలు, అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. డిపాజిట్‌దారులకు సకాలంలో సొమ్ము చెల్లించకపోవడం వల్ల తీవ్ర మనోవేదనకు గురైన వారిలో సుమారు 28 మంది మరణించారని పేర్కొనడం బాధాకరమన్నారు. ఏళ్లుగా కష్టపడి సంపాదించిన సొమ్ము కోసం రైతులు, పేదలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ, అధికార యంత్రాంగ వైఫల్యమని విమర్శించారు. డిపాజిట్‌దారుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారి సొమ్మును పూర్తి స్థాయిలో చెల్లించాలని జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు డిపాజిట్‌దారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో స్పీడ్ బ్రేకర్ లాగా వచ్చింది.. చంద్రబాబు నాయకత్వంలో ఎదుర్కొంటాం: మంత్రి అచ్చెన్నాయుడు

- ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో 56 శాతం వర్షపాతం లోటు
- విపత్కర పరిస్థితుల్లో చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వం అందిస్తున్నారన్న అచ్చెన్న
- రైతులను గొడ్డలి పార్టీ నేతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం 46 లక్షల మంది రైతులకు పంటల బీమా కల్పించిందని వెల్లడి
- గత ప్రభుత్వం ఐదేళ్లుగా పంటల బీమా ప్రీమియం కూడా చెల్లించలేదని ఆగ్రహం



రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, ఇది అభివృద్ధికి స్పీడ్ బ్రేకర్ లాగా పరిణమించిందని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అయితే, ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వంలో ఈ విపత్తును ఎదుర్కొని రైతులకు అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. లీడర్‌షిప్ కాన్క్లేవ్‌లో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ చర్యలపై ప్రసంగించారు. ఎల్‌నినో కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 56 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని, అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశంలో 70 శాతం, చిత్తూరులో 65 శాతం, విశాఖపట్నంలో 60 శాతం వర్షపాతం లోటు ఉందని గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్రంలోని 680 మండలాల్లో వర్షాలు లేక కరవు ఛాయలు అలుముకున్నాయని తెలిపారు. అయితే, ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసి గత ఏడాదే చెరువులను నింపడం వంటి ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ఈ కష్టకాలంలో కొందరు 'గొడ్డలి పార్టీ' నాయకులు రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు. గతంలో పట్టిసీమను వ్యతిరేకించి, ఐదేళ్ల పాటు ఉచిత పంటల బీమా అని చెప్పి కనీసం ప్రీమియం కూడా చెల్లించని వారు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 46 లక్షల మంది రైతులకు పంటల బీమా సౌకర్యం కల్పించిందని, ఇప్పటికే రూ.4,800 కోట్లు బీమా చేశామని స్పష్టం చేశారు. 27 నెలల క్రితం అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నమైన రాష్ట్రాన్ని చంద్రబాబు మళ్లీ గాడిన పెట్టారని అచ్చెన్నాయుడు కొనియాడారు.గతంలో రాజమండ్రి సూపర్ సైక్లోన్, శ్రీకాకుళంలో తితిలి తుపాను వంటి భయంకరమైన విపత్తులను చంద్రబాబు సమర్థంగా ఎదుర్కొన్నారని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. 30 ఏళ్ల క్రితమే నీటి సమస్యపై ఆయన దృష్టి సారించారని, 2014-19 మధ్య సాగునీటి ప్రాజెక్టులపై రూ.65 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. 2019లో టీడీపీ గెలిచి ఉంటే రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు పూర్తయ్యేవని అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధులు వాస్తవాలు గ్రహించి రైతులకు ధైర్యం చెప్పాలని ఆయన సూచించారు.

# పలు జిల్లాల్లో పిడుగులతో వర్షాలు

**-నేడు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు అవకాశం**

**-ఆకస్మిక వర్షాలు, పిడుగులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక**

**అమరావతి: సువర్ణ జ్యోతి, సెప్టెంబర్ 8:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సెప్టెంబర్ 9వ తేదీన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది.

### పిడుగుల సమయంలో జాగ్రత్త

ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా పిడుగులు పడే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకూడదని హెచ్చరించారు. సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. ఆకస్మికంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రయాణికులు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

### మంగళవారం పలుచోట్ల భారీ వర్షం

మరోవైపు మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గణనీయమైన వర్షపాతం నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 52.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఏలూరు జిల్లా పెరికగూడెంలో 31.3 మిల్లీమీటర్లు, పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడులో 27.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు, గుంటూరు జిల్లా పంద్రపాడులో 24 మిల్లీమీటర్ల చొప్పున వం-ష్షపాతం నమోదైనట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.



# టీడీపీలో చేరిన వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిన్న శ్రీను



**-సీఎం చంద్రబాబు సమక్షంలో పార్టీ కండువా**

**-కుమార్తె సిరి సహస్రతో కలిసి తెలుగుదేశంలో చేరిక**

**విజయనగరం, సువర్ణ జ్యోతి, సెప్టెంబర్ 8:** విజయనగరం జిల్లా జడ్పీ ఛైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్యాంపు కార్యాలయంలో ఆయన సమక్షంలో మజ్జి శ్రీనివాసరావు టీడీపీ కండువా కప్పుకున్నారు. మజ్జి శ్రీనివాసరావుతో పాటు ఆయన కుమార్తె సిరి సహస్ర కూడా తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా, విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఉన్న మజ్జి శ్రీనివాసరావు టీడీపీలో చేరడం విజయనగరం జిల్లా రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది





# రాష్ట్రంలో టాప్-3లో తణుకు నియోజకవర్గం

**-అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ**

**-ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను ప్రత్యేకంగా అభినందించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్**

**తణుకు సువర్ణ జ్యోతి:** రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో అభివృద్ధి, తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల అమలులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టాప్-3 నియోజకవర్గాల్లో తణుకు నియోజకవర్గం స్థానం సంపాదించింది. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రెండో రోజు నిర్వహించిన తెలుగుదేశం పార్టీ లీడర్స్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని ప్రస్తావించారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాల నిర్వహణలో తణుకు నియోజకవర్గం రాష్ట్రస్థాయిలో విశేష ప్రతిభ కనబరుస్తూ టాప్-3లో నిలవడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా అభినందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల మధ్య జరిగిన సమీక్షలో తణుకు నియోజకవర్గం అగ్రస్థానంలో నిలవడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.





## ప్యాసింజర్ ఆటోకు నిప్పు.. ఆరుగురిపై కేసు.....

**సిగరెట్లు, డ్రింక్స్ అప్పుగా ఇవ్వలేదన్న వివాదమే కారణమా?**

**చాటపర్రులో అర్ధరాత్రి ఘటన.. పోలీసులు దర్యాప్తు**

**ఏలూరు రూరల్,** సిగరెట్లు, డ్రింక్స్ అప్పుగా ఇవ్వలేదన్న వివాదం నేపథ్యంలో ఓ యువకుడిపై దాడి చేసిన ఘటనలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కక్ష పెంచుకున్న కొందరు వ్యక్తులు అతడి కుటుంబానికి చెందిన ప్యాసింజర్ ఆటోకు నిప్పంటించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6వ తేదీ రాత్రి దుకాణం మూసుకుని ఇంటికి వెళ్తున్న నాగార్జునను గుడిపూడి రాజేష్, మరికొందరు వ్యక్తులు అడ్డుకుని దాడి చేసినట్లు ఫిర్యాదు అందింది. దీనిపై బాధితుడు ఏలూరు రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో కక్ష పెంచుకున్నట్లు ఆరోపణలు ఉన్న వ్యక్తులు ఈ నెల 7వ తేదీ రాత్రి సుమారు 11.55 గంటల సమయంలో నాగార్జున తండ్రి ఇంటి ముందు నిలిపి ఉంచిన ప్యాసింజర్ ఆటోకు నిప్పంటించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మంటలను గమనించిన కుటుంబ సభ్యులు బయటకు వచ్చేసరికి అక్కడ ఉన్న గుడిపూడి రాజేష్, మరికొందరు వ్యక్తులు పరారైనట్లు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. స్థానికులు వెంటనే స్పందించి నీళ్లు పోసి మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే ఆటోకు నష్టం జరిగినట్లు సమాచారం. ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సామాన్యుడిలా భోజనం కోసం క్యూలో ఎమ్మెల్యే రోషన్‌తో లోకేష్.....



**మంగళగిరి:** పార్టీలో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ సమానమేనని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మరోసారి చాటిచెప్పారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన శాసనసభ్యుల కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. కాంక్లేవ్ అనంతరం సహచర ఎమ్మెల్యేలతో కలిసి లోకేష్ భోజనానికి క్యూలో నిలబడ్డారు. ఎమ్మెల్యే రోషన్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలతో కలిసి సామాన్యుడిలా క్యూ పాటిస్తూ సహపంక్తి భోజనం చేశారు. జాతీయ స్థాయి నాయకుడిగా తనకున్న హోదాను పక్కనపెట్టి సహచర ఎమ్మెల్యేలతో సమానంగా క్యూలో నిలబడటం అందరి దృష్టిని ఆకర్షించింది. పార్టీలో ప్రతి ఒక్కరూ సమానమేనన్న సందేశాన్ని లోకేష్ తన ప్రవర్తన ద్వారా చెప్పకనే చెప్పారని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

## టీడీపీ- జనసేన కార్యకర్తలకు పవన్ కల్యాణ్ హెచ్చరిక

**అమరావతి:** కూటమి ఐక్యతకు భంగం కలిగించేలా పరస్పరం విమర్శలు, దూషణలకు పాల్పడవద్దని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ టీడీపీ, జనసేన కార్యకర్తలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కూటమి ఐక్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలపై ఉందని ఆయన పేర్కొన్నారు. టీడీపీ కార్యకర్తలు, జనసైనికులు పరస్పర గౌరవంతో వ్యవహరిస్తూ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. పార్టీ అధిష్ఠానం ఇచ్చే ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. జనసేన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కూటమి ఐక్యతను కాపాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.



## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు.. రైల్వే మంత్రి కీలక ప్రకటన

**వచ్చే ఏడాది మే, జూన్‌లో బుల్లెట్ రైలు ట్రయల్స్**

**2 నుంచి 4 నెలల తర్వాత అధికారికంగా ప్రారంభం**

**తొలి బాడీ ఫ్రేమ్ ఇప్పటికే సిద్ధమైందన్న అశ్వినీ వైష్ణవ్**

**సూరత్-వాపి మార్గం డిసెంబరులో పూర్తయ్యే అవకాశం**

**గంటన్నరలో ముంబై నుంచి వడోదరకు**



**సువర్ణ వడోదర:** భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. వచ్చే ఏడాది మే లేదా జూన్‌లో ఈ రైలు ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు పూర్తైన రెండు నుంచి నాలుగు నెలల్లో వాణిజ్య సేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న హైస్పీడ్ రైలు తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం దానిపై స్క్వీజ్ టెస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి మన సొంత బుల్లెట్ రైలు ట్రయల్స్ కోసం పట్టాలపైకి వస్తుంది. రెండు నుంచి నాలుగు నెలల పరీక్షల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభిస్తారు" అని వైష్ణవ్ చెప్పారు. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సూరత్-వాపి మార్గం ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే వడోదర నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం గంటన్నర మాత్రమే ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ బుల్లెట్ రైలు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వే రంగంలో ఆపరేటింగ్, రిజర్వేషన్ వ్యవస్థలతో పాటు నిర్మాణ విధానాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసినట్లు వైష్ణవ్ తెలిపారు. కొత్తగా 36 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లు వేశామని చెప్పారు. వందే భారత్ సాంకేతికతతో కార్గో రైళ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. చినాబ్ వంతెన, మిజోరాంను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టు వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి వేగం పెరిగిందన్నారు.

## డీఎస్సీపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమే

**విజయవాడ సెప్టెంబర్ 8 :**టీడీపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమేనని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ఈ తరహా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని ఆయన ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేయడంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో తమ ఓటు బ్యాంకుకు నష్టం జరుగుతుందనే భయం వైసీపీని వెంటాడుతోందని బోడే ప్రసాద్ అన్నారు. అందుకే ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ భుజానికెత్తుకున్నారని విమర్శించారు. డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై కూడా అక్రమాలు జరిగాయంటూ ఒక పత్రికను అడ్డుపెట్టుకుని విష ప్రచారం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గంలోని ఇద్దరు అక్కాచెల్లెళ్ల ఉదంతాన్ని ఆయన ఉదహరించారు. సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో ఉంటున్న ఆ యువతులు కష్టపడి చదివి డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని, వారిలో ఒకరు 2019లో కేవలం ఒక్క మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయారని తెలిపారు. ఐదేళ్ల తర్వాత వారి కల నెరవేరితే, వారి మెరిట్‌ను కూడా ప్రశ్నిస్తూ వైసీపీ నేతలు అవమానించడం బాధాకరమన్నారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు గతంలో యువత జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. గతంలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో చేసిన తరహాలోనే ఇప్పుడు డీఎస్సీ అభ్యర్థులపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వేలాది మంది యువత సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. యువత తిరగబడితే దాని ప్రభావం ఎలా ఉంటుందో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి తెలుస్తుందని అన్నారు. డీఎస్సీపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజల్లోకి వెళ్లి తిప్పికొడతామని బోడే ప్రసాద్ స్పష్టం చేశారు.



## ప్రజల అభిప్రాయాలే పాలనకు ప్రామాణికం

- **నరసాపురం నియోజకవర్గంలో సానుకూల ప్రజాభిప్రాయం - మరింత బలోపేతం చేయాలి**
- **వివిధ శాఖల జిల్లా -అధికారులతో కలెక్టర్ నాగరాణి సమీక్ష**



**భీమవరం,** ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడమే కాకుండా, ఆ సేవలపై వారి అభిప్రాయాలను కూడా తెలుసుకుని పాలనను మరింత మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రజల అభిప్రాయాలే ప్రభుత్వ పాలనకు నిజమైన ప్రామాణికమని ఆమె పేర్కొన్నారు. నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో సానుకూల ప్రజాభిప్రాయం (పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్) మరింత బలోపేతం చేసేందుకు మంగళవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గంలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలు, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు తదితర అంశాలపై శాఖల వారీగా సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల, గ్రామ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని ఆదేశించారు. సమస్య తీవ్రతను బట్టి సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు.

### క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ పెరగాలి

గ్రామాలు, వార్డుల్లో గ్రామ రెవెన్యూ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయి అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలను తరచూ సందర్శించి తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయా కేంద్రాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించి లోటుపాట్లు ఉంటే వెంటనే సరిచేయాలని తెలిపారు. ప్రజలకు సేవలు అందించిన తర్వాత అవి సక్రమంగా అందుతున్నాయా? వారికి ఉపయోగకరంగా ఉన్నాయా? అనే విషయాలను కూడా అధికారులు తెలుసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, అభిప్రాయాల ఆధారంగా అధికారుల పనితీరును మెరుగుపరచుకోవాలని పేర్కొన్నారు.

### సంక్షేమ పథకాలు ప్రతి అర్హునికి అందాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయో అధికారులు నిరంతరం పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, అర్హతలు, దరఖాస్తు విధానం, అందే ప్రయోజనాలపై సంబంధిత శాఖలు విస్తృతంగా తెలియజేయాలని అన్నారు.

### అభివృద్ధి పనులు ప్రజలకు కనిపించాలి

నరసాపురం నియోజకవర్గంలో జరుగుతున్న రహదా రులు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, విద్యుత్ తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల ఫలితాలు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రతి అభివృద్ధి పనిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

### ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ నాగరాణి స్పష్టం చేశారు. ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభించినప్పుడే ప్రభుత్వంపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి శాఖకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పరిష్కరించాలని, పరిష్కరించిన సమస్యలు ప్రజలకు ఎంతవరకు ఉపయోగకరంగా ఉన్నాయో కూడా తెలుసుకోవాలని సూచించారు.

### అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, పారదర్శకంగా అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సూచనలను తెలుసుకోవాలని సూచించారు.

### ఆర్డీవోకు కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలు


నరసాపురం నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆర్డీవోను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలవుతున్న నవచేతన కార్యక్రమాన్ని ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తరచూ పర్యవేక్షించాలని సూచించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది మధ్య సమన్వయం పెంచి ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలన్నారు. తదుపరి సమీక్షా సమావేశం నాటికి జిల్లా అధికారులు తమ శాఖల పనితీరును మరింత మెరుగుపరుచుకుని నియోజకవర్గ స్థాయిని పెంచాలని కలెక్టర్ సూచించారు. ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్లలో ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు, తాగునీరు, సీటింగ్ వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ శాఖ కూడా పనితీరును మెరుగుపరుచుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. నరసాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండే సమర్థవంతమైన పరిపాలన అందించాలని కలెక్టర్ నాగరాణి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి వై. దోసిరెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గానికి సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# కేబుల్ వ్యాపారంలోకి ఆదిత్యా బిర్లా

ముంబై, సెప్టెంబర్ 3 : పలు వ్యాపారాలు నిర్వహిస్తున్న ఆదిత్యా బిర్లా గ్రూపు తాజాగా వైర్లు, కేబుల్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. ఈ విభాగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి రూ.1,800 కోట్ల మేర పెట్టుబడులు పెట్టబోతున్నట్టు గ్రూపు చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. అల్ట్రాటెక్ సిమెంట్ విభాగంలో పనిచేయనున్న ఈ కేబుల్స్ అల్ట్రావోల్ట్ పేరుతో విడుదల చేసినట్టు ఆయన చెప్పారు. గత నాలుగేండ్లలో మూడో అతిపెద్ద వ్యాపారం ఇదే కావడం విశేషం.

# మహీంద్రా బ్లేజో ట్రక్కులు



హైదరాబాద్, సెప్టెంబర్ 3 : ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా.. దేశీయ మార్కెట్లోకి బ్లేజో ఐ-టీఆర్కే ట్రక్కులను తీసుకొచ్చింది. అధిక మైలేజీ ఇచ్చే ఈ ట్రక్కులతో కొనుగోలు చేసిన నాటి నుంచి ఐదేండ్లలో రూ.15 లక్షల వరకు ఆదాకానున్నదని కంపెనీ ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వినోద్ సహవే తెలిపారు.ఆటోమెబైల్ నివేదికలను విశ్లేషించండి 7.2 లీటర్ల ఇంజిన్‌తో తయారైన ఈ 320 హెచ్‌పీ ఎంపవర్ మాడల్ పాత మాడళ్లతో పోలిస్తే అధిక మైలేజీ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ ఏడాది చివరినాటికి ఈ-బస్సును కూడా తీసుకురానున్నట్టు ప్రకటించారు.

# ఆనంద్ మహీంద్రా ఆవిష్కరించిన స్పెషల్ బైక్

క్లాసిక్ లెజెండ్స్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న.. జావా యెజ్డీ మోటార్‌సైకిల్స్, ఇటీవల లాంచ్ చేసిన జావా 42 ఎఫ్‌జె ఆల్ స్టార్స్ తర్వాత తమ కొత్త శ్రేణిని విస్తరిస్తూ.. 'జావా ఆల్ స్టార్స్ 42 బాబర్'ను ఆవిష్కరించింది. మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా, గ్లోబల్ చెస్ లీగ్ 2026లో ఈ బైకును ఆవిష్కరించారు. దీని ధరలు రూ. 2.09 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతాయి. జావా ఆల్ స్టార్స్ 42 బాబర్.. స్టాండర్డ్ జావా 42 బాబర్‌పైనే ఆధారపడి ఉంటుంది. కానీ కొత్త పెయింట్ ఎంపికలు, చదరంగం గళ్ల గ్రాఫిక్స్, ఆల్ స్టార్స్ చిహ్నాన్ని పొందుతుంది. ఇది బ్లాక్ మిర్రర్, షాడో బ్లాక్, సిల్వర్ నైట్, జాస్పర్ రెడ్, మిస్టిక్ కాపర్ అనే ఆరు రంగులలో లభిస్తుంది.

**వేరియంట్ వారీ ధరలు**

**ఆల్ స్టార్స్ మిస్టిక్ కాపర్: రూ. 2,08,942**

**ఆల్ స్టార్స్ జాస్పర్ రెడ్: రూ. 2,15,942**

**ఆల్ స్టార్స్ సిల్వర్ నైట్: రూ. 2,15,942**

**ఆల్ స్టార్స్ షాడో బ్లాక్: రూ. 2,17,942**

**ఆల్ స్టార్స్ బ్లాక్ మిర్రర్: రూ. 2,19,942**

ఈ స్పెషల్ ఎడిషన్.. స్టాండర్డ్ 42 బాబర్‌లోని 334 సీసీ సింగిల్-సిలిండర్, లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌తోనే కొనసాగుతుంది. ఇది 7,500 తీజూఎ వద్ద 29 హార్స్ పవర్, 5,500 తీజూఎ వద్ద 30.01 న్యూటన్ మీటర్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనికి ఆరు-స్పీడ్ గేర్‌బాక్స్ మరియు ఎలక్ట్రానిక్ ఫ్యూయల్ ఇంజెక్షన్ జత చేయబడి ఉంటాయి. ఈ మోటార్‌సైకిల్‌లో డబుల్-క్రాడిల్ ఫ్రేమ్, 35 మిమీ టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్కులు, 7 టైప్స్ ప్రీలోడ్ సర్దుబాటుతో కూడిన గ్యాస్-ఛార్జ్డ్ రియర్ మోనోషాక్‌ను వంటివి ఉన్నాయి. బ్రేకింగ్ కోసం ముందువైపు 280 మిమీ డిస్క్, వెనుకవైపు 240 మిమీ డిస్క్‌తో పాటు డ్యూయల్-ఛానల్ ఏబీఎస్ ఉన్నాయి. ఈ బైక్ ఫ్యూయెల్ ట్యాంక్ కెపాసిటీ 12.5 లీటర్లు.




# ఫోక్స్‌వ్యాగన్‌లో భారీగా ఉద్యోగాల కోత.. లక్ష మందిని తీసేస్తామని ప్రకటన




జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ భారీగా ఉద్యోగ కోతలకు సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా లక్ష ఉద్యోగాలను తొలగించేందుకు నిర్ణయించినట్లుగా ప్రకటించింది. ఈ దశాబ్దం చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తి కానుందని వెల్లడించారు. ఈ మేరకు కంపెనీ యాజమాన్యం, కార్మిక సంఘాలు ఒక అంగీకారానికి వచ్చాయని పేర్కొంది. ఇందులో ఇప్పటికే 50 వేల ఉద్యోగాల కోతకు అంగీకరించగా.. తాజాగా మరో 50 వేల పోస్టులను తొలగించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పింది. కాగా, కంపెనీ చరిత్రలోనే కాకుండా ప్రపంచ ఆటోమొబైల్ రంగంలోనే ఇది అతిపెద్ద పునర్వ్యవస్థీకరణగా నిలవనుంది. కంపెనీ ఆర్థికపరమైన అంశాలకు తగినట్లుగా ఉద్యోగుల సంఖ్యను క్రమబద్ధీకరించడం తప్పనిసరని ఫోక్స్‌వ్యాగన్ కంపెనీ ఈ సందర్భంగా పేర్కొంది. అమెరికా సుంకాలు, ఎలక్ట్రిక్ కార్లకు డిమాండ్‌లో హెచ్చుతగ్గులు, ముఖ్యంగా చైనాకు చెందిన సంస్థల నుంచి పెరుగుతున్న పోటీ కారణంగా యూరప్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ క్రమంలోనే లేఆఫ్స్‌కు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఫోక్స్‌వ్యాగన్ కంపెనీలో దాదాపు 6.67 లక్షల మంది పనిచేస్తున్నారు. ఒక్క జర్మనీలోని దాదాపు 43 శాతం మంది విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ఆ కంపెనీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా లక్ష ఉద్యోగాలను తగ్గిస్తామని ప్రకటించింది. అంటే మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 15 శాతానికి సమానం అన్నమాట. ఈ ఉద్యోగాల కోతను కార్మిక సంఘాలు వ్యతిరేకించినట్లుగా గతంలో వార్తలు వచ్చాయి. అయితే తాజా ప్రకటనలో మాత్రం కార్మిక సంఘాలు కూడా అంగీకరించినట్లు తెలపడం గమనార్హం. కాగా, హ్యానోవర్, ఎమ్డెన్, జ్వికావ్, నెకార్సుల్మ్‌లోని నాలుగు జర్మన్ ప్లాంట్ల దీర్ఘకాలిక భవిష్యత్తుపై స్పష్టత లేదని కంపెనీ తెలిపింది. అయితే ఈ ప్లాంట్లకు ప్రత్యామ్నాయ వినియోగ మార్గాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. పూర్తి స్థాయి ప్లాంట్లను జర్మనీలో మూసివేయడం వోక్స్‌వ్యాగన్‌కు ఇదే తొలిసారి కానుందని కార్మిక వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ప్లాంట్ల మూసివేతకు ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఐజీ మెటల్ యూనియన్ స్పష్టం చేసింది. కార్మికులు, లోయర్ సాక్సనీ రాష్ట్రంతో కలిసి చర్చల ద్వారా రాజీ కుదిరిందని తెలిపింది.

# అందుబాటు ధరలో రాయల్ ఎన్‌ఫీల్డ్ కొత్త అడ్వెంచర్ బైక్.. హిమాలయన్ 440 వచ్చేసింది!



**443 సీసీ ఇంజిన్‌తో కొత్త బైక్**

**25.4 బీహెచ్‌పీ, 34 ఎన్ఎం టార్క్**

**ఆరు గేర్ల గేర్‌బాక్స్ ఏర్పాటు**

**డ్యూయల్ ఛానల్ ఏబీఎస్ స్టాండర్డ్**

**సెప్టెంబర్ 4 నుంచి బుకింగ్స్ ప్రారంభం**

అడ్వెంచర్ బైక్ కొనాలనుకునేవారికి రాయల్ ఎన్‌ఫీల్డ్ గుడ్‌న్యూస్ చెప్పింది. సంస్థ కొత్తగా హిమాలయన్ 440ను భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. రూ.2.29 లక్షల ఎక్స్‌షోరూమ్ ధరతో దీన్ని విడుదల చేసింది. హిమాలయన్ 450 కంటే తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ మోడల్.. హిమాలయన్ పేరుతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రయాణానికి పదేళ్లు పూర్తయిన సందర్భంగా విడుదలైంది. కొత్త హిమాలయన్ 440లో 443 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఉంది. ఇది 25.4 బీహెచ్‌పీ శక్తిని, 34 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇంజిన్‌కు ఆరు గేర్ల గేర్‌బాక్స్‌ను జత చేశారు. పాత హిమాలయన్‌లో ఉన్న ఐదు గేర్లకు బదులుగా ఇది వచ్చింది. ఇంజిన్‌లో శబ్దం, వైబ్రేషన్లు తగ్గించేలా మార్పులు చేసినట్లు కంపెనీ తెలిపింది. బైక్‌లో హాఫ్ డ్యూప్లెక్స్ స్ప్లిట్ క్రేడిల్ ఫ్రేమ్‌ను ఉపయోగించారు. ముందు 41 మిల్లీమీటర్ల టెలిస్కోపిక్ ఫోర్కులు ఉన్నాయి. ఇవి 200 మిల్లీమీటర్ల ట్రావెల్‌ను అందిస్తాయి. వెనుక లింకేజ్ టైప్ మోనోషాక్ 180 మిల్లీమీటర్ల ట్రావెల్ ఇస్తుంది. ముందు 21 అంగుళాలు, వెనుక 17 అంగుళాల వైర్-స్పోక్ వీల్స్ ఉన్నాయి. హిమాలయన్ 440లో 220 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్ ఉంది. సీటు ఎత్తు 800 మిల్లీమీటర్లు. ముందు 300 మిల్లీమీటర్ల డిస్క్, వెనుక 240 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేకులు ఉన్నాయి. డ్యూయల్ ఛానల్ ఏబీఎస్ స్టాండర్డ్‌గా ఇచ్చారు. ఆఫ్-రోడ్ రైడింగ్ కోసం ఏబీఎస్‌ను వెనుక చక్రానికి ఆఫ్ చేసుకునే అవకాశం ఉంది. ఫీచర్ల విషయానికొస్తే ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, డిజిటల్-అనలాగ్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, ట్రిప్పర్ నావిగేషన్, యూఎస్‌బీ టైప్-సీ ఛార్జింగ్ పోర్ట్ ఉన్నాయి. 15 లీటర్ల ఫ్యూయల్ ట్యాంక్ ఇచ్చారు. టూరింగ్ కోసం లగేజీ తీసుకెళ్లే సదుపాయాన్ని కూడా మెరుగుపరిచారు. సెలా బ్లాక్, మస్టాంగ్ బ్రౌన్, నెలాంగ్ వైట్ రంగుల్లో బైక్ లభిస్తుంది. తొలుత విక్రయించే బైక్‌లపై 10వ వార్షికోత్సవ ప్రత్యేక బ్యాడ్జ్ ఉంటుంది. సెప్టెంబర్ 4 నుంచి బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్‌షిప్‌లతో పాటు కంపెనీ వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవచ్చు.

# రూ.1 లక్ష పెట్టుబడికి రూ.3.28 లక్షలు.. గోల్డ్ బాండ్ ఇన్వెస్టర్లకు భారీ లాభం!



సావరిన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ)లో పెట్టుబడి పెట్టిన వారికి భారీ లాభం వచ్చింది. 2021-22 సిరీస్ ఎ× బాండ్ల ముందస్తు రిడెంప్షన్ ధరను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రూ.15,334గా నిర్ణయించింది. ఈ బాండ్లను 2026 సెప్టెంబర్ 7 నుంచి ముందుగానే వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. 2021 సెప్టెంబర్‌లో జారీ చేసిన ఈ ఎస్‌జీబీ సిరీస్ ఆన్‌లైన్ కొనుగోలుదారులకు గ్రాము రూ.4,682 ధరకు లభించింది. ప్రస్తుత రిడెంప్షన్ ధరతో పోలిస్తే గ్రాముకు రూ.10,652 లాభం వస్తుంది. అంటే దాదాపు 228 శాతం రాబడి. వడ్డీని ఇందులో లెక్కించలేదు.

**రూ.1 లక్ష పెడితే ఎంత?**

2021లో ఈ సిరీస్‌లో రూ.1 లక్ష పెట్టుబడి పెట్టినట్లయితే.. బాండ్ విలువ ఇప్పుడు దాదాపు రూ.3.28 లక్షలకు చేరుతుంది. ఇది 228 శాతం మూలధన రాబడిని సూచిస్తుంది. దీనికి అదనంగా ఎస్‌జీబీపై ఏడాదికి 2.50 శాతం వడ్డీ కూడా లభిస్తుంది. వడ్డీని ఆరు నెలలకు ఒకసారి చెల్లిస్తారు.

ఐదేళ్లు పూర్తైన తర్వాత వడ్డీ చెల్లించే తేదీన మాత్రమే ఎస్‌జీబీ ముందస్తు రిడెంప్షన్ చేయవచ్చు. రిడెంప్షన్ ధరను నిర్ణయించేందుకు ముందు మూడు పనిదినాల్లో 999 స్వచ్ఛత బంగారం ముగింపు ధరల సగటును తీసుకుంటారు. సెప్టెంబర్ 7న జరగనున్న రిడెంప్షన్‌కు సెప్టెంబర్ 2, 3, 4 ధరలను పరిగణనలోకి తీసుకున్నారు. అయితే ఆన్‌లైన్ కాకుండా ఇతర మార్గాల్లో కొనుగోలు చేసిన వారికి అప్పటి జారీ ధర గ్రాముకు రూ.4,732గా ఉంది. ఆన్‌లైన్ కొనుగోలుదారులకు రూ.50 తగ్గింపు లభించింది.

# చిరు కూతురు 'అమ్ములు'గా అనశ్వర..

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'కాకా' నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో చిరంజీవి కూతురిగా నటిస్తున్న మలయాళ నటి అనశ్వర రాజన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా 'అమ్ములు' పాత్రను పరిచయం చేస్తూ ఈ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. విడుదలైన పోస్టర్‌లో అనశ్వర రాజన్ మెడికల్ కాలేజీ విద్యార్థినిగా అమాయకమైన లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. ఆమె నవ్వుతూ కనిపిస్తుండగా, వెనుక రక్షణ కవచంలా మెగాస్టార్ చిరంజీవి నీడ కనిపిస్తోంది. ఈ పోస్టర్ కూతురి జీవితంలో తండ్రి ప్రాముఖ్యతను, వారి మధ్య ఉండే బలమైన అనుబంధాన్ని తెలియజేసేలా ఉంది. సినిమాలో ఆమె పాత్ర కథాగమనంలో చాలా కీలకమని చిత్ర యూనిట్ పేర్కొంది. తన సహజ నటనతో మలయాళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న అనశ్వర రాజన్, 'ఛాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఇప్పుడు ఏకంగా మెగాస్టార్ సినిమాలో అత్యంత ముఖ్యమైన పాత్రను దక్కించుకోవడం ఆమె కెరీర్‌కు పెద్ద ప్లస్ కానుంది. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ వేగంగా జరుగుతోంది. తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో పాటు మాస్ యాక్షన్ అంశాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు.




# 'బేబీ' గుర్తుకు రాకపోతే మేం విజయం సాధించినట్టే: వైష్ణవి



'బేబీ' తర్వాత ఆనంద్, నేను ఛాలెంజింగ్‌గా తీసుకొని 'ఎపిక్' చేశాం. ఈ సినిమా చూస్తున్నప్పుడు 'బేబీ' గుర్తుకురాకపోతే మేము విజయం సాధించినట్టే. ఈ చిత్రం కచ్చితంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే నమ్మకం నాకు మొదటి నుంచి ఉంది' అన్నారు తెలుగు బ్యూటీ వైష్ణవి చైతన్య. బ్లాక్ బస్టర్ 'బేబీ' జోడీ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న తాజా చిత్రం'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. '90ం' వెబ్ సిరీస్ తో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న యువ దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించాడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా వైష్ణవి మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు.. మనం ఎన్నో లవ్ స్టోరీలు చూసుంటాం. కానీ, ప్రతి లవ్ స్టోరీలోనూ ఏదోక ప్రత్యేకత ఉంటుంది. ఎపిక్ లో కూడా ఆ ప్రత్యేకత ఉంది. భిన్న దారులు, భిన్న మనస్తత్వాలు ఉన్న ఇద్దరు యూకేకి చదువుకోవడానికి వెళ్లి, అక్కడ కలుస్తారు. లివ్ ఇన్ లో ఉంటారు. ఆ ఇద్దరు ప్రైవేట్ గా మాట్లాడుకునే మాటలు ఏవైతే ఉంటాయో, ఆ సంభాషణల మీద నడిచే సినిమా. అమ్మాయి జీవితాన్ని ఒకలా చూస్తుంది. అబ్బాయి ఒకలా చూస్తాడు. అసలు వీరిద్దరూ ఎలా కలిశారు? వీరిద్దరి ఆలోచనలు ఏంటి? అనేది కొత్తదనాన్ని తీసుకొస్తుంది. ఈ సినిమాలో హంగామా ఉండదు. హత్తుకునేలా ఉంటుంది. ఇందులో ఆనంద్ పోషించిన ఆదిత్య పాత్ర సాఫ్ట్ గా, కామ్ గా ఉంటుంది. జీవితంలో ఎదురైన అనుభవాల నుంచి ఆదిత్య ఏం నేర్చుకున్నాడనేది ఆసక్తికరంగా ఉ ంటుంది. నేను పోషించిన కదలి పాత్ర స్ట్రాంగ్ అమ్మాయి. తన కోసం తాను నిలబడే అమ్మాయి. క్లారిటీ ఉన్న అమ్మాయి.

# ఓటీటీలోకి 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే..

సూర్య, మమితా బైజు జంటగా నటించిన తాజా చిత్రం'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టు 14న థియేటర్స్‌లో రిలీజై బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా రూ. 260 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి రికార్డు సృష్టించింది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ప్రేక్షకులను అలరించేందకు రెడీ అయింది. సెప్టెంబర్ 11 నుంచి ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కానుంది. ఈ మేరకు సదరు ఓటీటీ సంస్థ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది.




**విశ్వనాథ్ అండ్ సన్స్ కథేంటంటే..**

సంజయ్ విశ్వనాథ్(సూర్య) ఓ వ్యాపారవేత్త, ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన షూటర్. 40 ఏళ్లు వయసొచ్చినా పెళ్లి చేసుకోడు. అమెరికాకి వెళ్లి సరోగసి ద్వారా మగబిడ్డని కని స్వదేశానికి తిరిగొస్తాడు. కొన్నాళ్ల తర్వాత పిల్లాడు ఓ అరుదైన వ్యాధి బారిన పడతాడు. బోన్ మారో(ఎముక గుజ్జు) ట్రాన్స్ ప్లాంట్ అవసరమవుతుంది. దీంతో బిడ్డకు జన్మనిచ్చిన తల్లి అవసరం ఏర్పడుతుంది. అమెరికాకు తిరిగెళ్లి సరోగసి మదర్ మ్యాడీ (మమిత)ని వెతికి భారత్‌కి తీసుకొస్తాడు. సర్జరీ తర్వాత ఆమె తిరిగి వెళ్ళిపోవాలని ముందే ఒప్పందం చేసుకుంటాడు. 20 ఏళ్ల మ్యాడీ.. సంజయ్ ఇంటికి వచ్చిన తర్వాత వారి జీవితాల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి అసలు సంజయ్ 40 ఏళ్లు వచ్చినా పెళ్లికి ఎందుకు దూరంగా ఉంటున్నాడు? తల్లి అవసరం లేకుండా తన కొడుకును పెంచుకోగలిగాడా? మ్యాడీ ప్రేమని సంజయ్ ఎందుకు తిరస్కరించాడు? చివరకు పెళ్లి విషయంలో సంజయ్ తన ఆలోచన మార్చుకున్నాడా లేదా? అనేది మిగతా స్టోరీ.

# సెన్సార్ పూర్తి చేసుకున్న సుమంత్ 'మహేంద్రగిరి వారాహి'.!

వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో సుమంత్ నటిస్తున్న తాజా చిత్రం 'మహేంద్రగిరి వారాహి' (మీఘిష్ట్రవఅనతీఘిస్త్రఅతీఅ ఘితీఘిష్ట్రఅ). సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'ఖ/ూ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. ఈ చిత్రంలో సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి, ఐశ్వర్య రాజేష్ మరియు మాళవికా నాయర్ నటిస్తుండగా, వెన్నెల కిషోర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. అప్నా రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను రాగమయూరి ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిలిప్స్ బ్యానర్‌లపై మధు కాలిపు నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.




# విజయ్ దేవరకొండ 'రణబాలి' టీజర్ డేట్ ఫిక్స్.. రష్మికతో మరోసారి స్క్రీన్‌పై మ్యాజిక్!



రౌడీ హీరో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి' పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఖ'టాక్సీవాలా' ఫేమ్ రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నేషనల్ క్రష్ రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తోంది. ముఖ్యంగా పెళ్లి తర్వాత విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా కలిసి నటిస్తున్న సినిమా కావడంతో.. ఈ కాంబినేషన్‌పై అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన సినిమా ఫస్ట్ లుక్ మంచి స్పందన అందుకోగా.. తాజాగా మేకర్స్ మరో కీలక అప్‌డేట్ ఇచ్చారు. సినిమా టీజర్ రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించారు. విజయ్ దేవరకొండ, రష్మిక అభిమానులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న 'రణబాలి' టీజర్ సెప్టెంబర్ 9న విడుదల కానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించింది. పీరియడ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న యాక్షన్ డ్రామా కావడంతో టీజర్‌లో విజయ్ దేవరకొండను ఎలాంటి లుక్‌లో చూపించబోతున్నారు? ఆయన పాత్ర ఎలా ఉ ండబోతోంది? సినిమాలోని యాక్షన్ ఎలిమెంట్స్ ఏ స్థాయిలో ఉంటాయి? అనే విషయాలపై ఇప్పుడు ఆసక్తి పెరిగింది. ఫస్ట్ లుక్‌తో సినిమాకు మంచి బజ్ వచ్చిన నేపథ్యంలో టీజర్ ఈ హైప్‌ను మరింత పెంచుతుందని అభిమానులు భావిస్తున్నారు. 'రణబాలి'కి ఉన్న ప్రత్యేక ఆకర్షణల్లో విజయ్ దేవరకొండ--రష్మిక మందన్నా జోడీ కూడా ఒకటి. ఇప్పటికే ఈ ఇద్దరూ కలిసి నటించిన సినిమాలకు ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ వచ్చింది. ఇప్పుడు పెళ్లి తర్వాత మరోసారి జంటగా కనిపించనుండటంతో.. ఈ సినిమాపై ఫ్యాన్స్‌లో మరింత క్యూరియాసిటీ ఏర్పడింది. వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు, కెమిస్ట్రీ సినిమాకు ఎంతవరకు ప్లస్ అవుతాయి అనేది కూడా ఆసక్తికరంగా మారింది. అయితే ఇది కేవలం రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కాకుండా పీరియడ్ యాక్షన్ డ్రామా కావడంతో.. రష్మిక పాత్ర కూడా కథలో కీలకంగా ఉండే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. 'అర్జున్ రెడ్డి' సినిమాతో విజయ్ దేవరకొండకు దేశవ్యాప్తంగా భారీ గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా ఉత్తరాది ప్రేక్షకుల్లో కూడా ఆయనకు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఆ తర్వాత ఆయన నటించిన కొన్ని సినిమాలు హిందీలోనూ విడుదలైనప్పటికీ.. 'అర్జున్ రెడ్డి' స్థాయిలో ప్రభావం చూపలేకపోయాయి. ఈ నేపథ్యంలో 'రణబాలి'తో విజయ్ దేవరకొండకు సిసలైన పాన్ ఇండియా సక్సెస్ దక్కుతుందని చిత్రబృందం నమ్మకంగా ఉన్నట్లు తెలుస్తోంది. కథ, పీరియడ్ బ్యాక్‌డ్రాప్, యాక్షన్ ఎలిమెంట్స్, భారీ నిర్మాణ విలువలు అన్ని భాషల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com